# మాతృత్వం



డాక్టరు వచ్చివెళ్లేడు. చెప్పవలసిన జాగ్రత్తలన్నీ చెప్పేడు. నన్ను ఏమీ చెయ్యలేని స్తబ్ధత నిశ్శబ్దంగా నిరీక్షించమంటోంది. దీపం సన్నదిగాచేసి, వెలుతురు ఉయ్యాల్లో ఉన్న బాబుమీద పడకుండా కాగితం అడ్డు పెట్టే. ఉంగరాలజుట్టు నీడల్లో నాలికల్లా వుంది.

రాజా డాక్టరున్ను పంపి, నా ప్రక్కగా వచ్చేడు. ఉయ్యాల్లో బాధలో ఒళ్ళు తెలియని జ్వరంలో ముక్కుతున్న బాబు శబ్దం గుండెల్ని నములుతోంది. బాధ! ఆవేదన!!

'ఎంత బాధపడుతున్నాడో' రుద్ధకంఠంతో రాజా అన్నాడు. అంతవరకు ఆపుకొన్న కన్నీళ్ళ కట్టవులు తెగేయి. దుఃఖం ఆగటంలేదు. పైకి శబ్దంచేస్తే బాబు లేస్తాడేమో అన్న భయంతో, గొంతులోపలే మ్రింగే. వెలుతురులో కన్నీళ్ళు కోళ్ళమీదపడి, జల్లెళ్ళు అవుతున్నై.

రాజా కళ్ళు తుడుస్తూ 'సుందరీ! నేను ఉంటాను. నువ్వు కొద్దిసేపు నడుం వాల్చు.'

నిద్రా! ఎలా పోనూ? ఎలా కళ్ళుమూసుకుని నిద్రపోనూ? తలవూపే పడుకోనని. భుజంమీద భారంగా చెయ్యినొక్కుతూ 'సావిట్లో వుంటా, పన్నెండు అయిన తర్వాత లేపు.' బాబువైపు వంగిచూచి మెట్లు దిగేడు. ఆవేదనతో అవి మూలిగేయి.

గడియారం క్షణాల్ని గడుపుతోంది. అవి ఆత్రుతతో వెడుతున్నాయో, నెమ్మదిగా ఆరాటాన్ని హెచ్చుచేస్తున్నాయో, తెలియకుండానే గడుస్తున్నాయో నేను చెప్పలేనేమో! కాలం అనేది లేదేమో! అచేతనాల్లో మరలతో అంకెల్ని తిప్పుకుంటూవున్న గడియారం అర్థంలేని జీవి అనిపిస్తోంది. కాలం యంత్రాలతోనా కొలిచేది... ఇప్పుడు... ఈక్షణాల్లో... ఈరాత్రిళ్ళలో... నాకు మాత్రం బాబు ఉచ్ఛ్వాస నిశ్వాసాల్తో, ఆ చిన్న హృదయపు స్పందనాల్తో నిర్ణయించాలి అనిపిస్తోంది. అదే... ఆగిపోతే... కాలంలేదు... దాని లెక్కలేదు. ఆఖరికి నా జీవితంకూడా.

ఈ సమయంలో, నేను చేసేది చెయ్యవలసినది ఏమీ లేదేమో! అక్కడ ఆ నిద్రలో బాధలో మృత్యువుతో పోరాడే బాబుని చూస్తూ కూర్చోడంకంటె ముక్తి, జయం అనేది వుంటుందా?

రేపు అన్న దాన్నిగురించి ఆలోచించలేను. అది వుండవచ్చు, లేకపోవచ్చు. కాని గతం అన్నది ఎదురుగా తిరుగుతోంది. ఏ విరుద్ధ కాల ప్రవాహంలో ఈ సన్నివేశంలోకి లాగబడి ఆ మృతమయేనో అదేవుంది. ఇప్పుడు ఈ నిర్జీవ ఆవేదనాపరిసరాలు జ్ఞాపకం తెస్తున్నాయి.

★ కందుకూరి లింగరాజు ★

'సంతానం! ఆయన కథల్లో దాచుకున్న అమృతంపు చిహ్నాలు చదివినపుడల్లా, నాకు వెలితిపోంది నట్టుగా వుండేది. న్యూనత కల్గేది. ఏడు సంవత్సరాలు దాటినా, స్త్రీ హృదయం అఱ్రులుచాచే అమరత్వం నాకు రాలేదని ఆక్రందించేదాన్ని, ఆ మాతృస్థానంకోసం.

ఆయన ఏదో కథ వ్రాసుకుంటున్నారు. సన్నటి వెన్నెల జల్లెడలా వూచల్లోంచి లోపలపడుతోంది. బంతిపూలు ముత్తైదువల్లా తలలూపుతున్నై. విచ్చిన పువ్వులు మధురభావాల్లోకి ఆయన్ని ప్రయాణం చేయిస్తున్నై.

'నిన్నరాత్రి కథ పూర్తిచేస్తున్నారా?' తలూపేరు. కాగితంమీద కలం జరుగుతోంది. బాధలో ముక్కలుకోసం తడుముకుంటున్నట్టుగా ముఖం ముకుళిస్తోంది.

ఏ విచిత్రజ్ఞాపకాలు, దేవతలకోర్కెలు, నాలో ఆశల్ని రేకెత్తిస్తున్నాయో తెలియదు...'మనకీ ఓపిల్లాడువుంటే...' ఇక అనలేకపోయే.

తెల్లబోయినవై ఆయన నాదైపు చూచేరు.

'ఏడేళ్ళయింది...దేవుడు...' కన్నీళ్లు అడ్డం వచ్చేయి.

దగ్గరసా వచ్చేరు. కన్నీళ్ళు ఒత్తుతూ 'ఏడేళ్ళు. అయితే ఏం? ఇది అంతనిరాశజెందవలసిన స్థితి కాదేమో! ఎంతమంది ఇంకా ఎక్కువ సంవత్సరాలనుండి...'

'ఉండవచ్చు. వాళ్ళు మనం కాదుగా. మనం మనమే. చాలాకాలంనుండి ఒక్కడువుంటే చాల బావుండునని ఆశించేం. ఎదురుచూసేం. ప్రార్థించేం. కాని...'

ఆయన కళ్ళలో బాధ స్పష్టంగా తెలుస్తోంది. ముఖం ముడతలుపడింది. క్షణికంగా స్ఫటికాలయేయి...'నేనూ ఆశించే. వాళ్ళతో మాట్లాడాలని ఆడుకోవాలని, కళ్ళుకాయలు కానేయి...'

నాకు దుఃఖం ఆగలేదు. హృదయావేదనపు ఎడారిల్లో చచ్చిపోవలసిందేనా? ముక్తిలేదూ? దేవుడు నన్ను గొడ్రాలికిందే జీవితం అంతం చెయ్యదలచుకున్నాడా?

భుజంమీద అనుకుని అనునయంచేసేరు. నిరాశల్లో ఎండిపొయ్యేటట్టు కనీళ్ళు ఇంకేయి. 'సుందరీ! మనం ఒక పిల్లాడిని దత్తతచేసుకుందాం' అన్నారు ఉండుండి.

'దత్తత!' ఆశ్చర్యపోయే. మాట్లాడలేక చూపులు ఒప్పగించే.

ఆతురతతోనే 'అవును సుందరీ! ఎందుకుకాదు. దత్తతచేసుకున్నాం అన్నంతలో మన పిల్లలు మనకి ఉండకుండా వుండరుకదా!'

నాలో విప్లవం చెలరేగింది. 'ఎలాచేసుకో మన్నారు. నాకు అక్కరలేదు. ఆ మొట్టమొదట లో మీరు ఏమనేవారో జ్ఞాపకంవుందా. అవన్నీ మర్చిపోయేరా'...

'మనకి కలగక పోరనికాదు. మారుగా-'

'ఒద్దు ..నాకు ఒద్దు...' సావిట్లోంచి వెళ్ళిపోయే. ఏంచెప్పదలచుకున్నారో కూడా వినకుండా, పడుకున్నా. ఆ మాటలు ద్వేషించేటట్లు చేస్తున్నాయి. పురుషులు ఎప్పుడూ ఇంతే!

ఆయన! తన నోటమ్మటగా ఆ మొదటి యౌవనంలో ఏ అమరలోకపు బిడ్డని ఆశించేడో, ఆనోటితోనే ఇంకో తల్లీ దండ్రీ కన్నబిడ్డని తీసుకువచ్చి, అది నాన్నా, అమ్మా అని పిలుస్తుంటే ఎలా ఓర్చుకోడానికి, ఎలా సంతోషపడ్డానికి హృదయం ఒప్పుకుందో? వివాహం, భార్య, వత్సరాల స్వర్గం, పవిత్రత, ఆదర్శం ఎంతహేయంగా, క్రూరంగా బలిచేసేరు! దూరంగా పడుకున్నా...ఆలోచనలు వస్తూనే వున్నై.

రాజా ఎంతలో మారిపోయాడు?

సహజస్వంగానే రోజులు గడిచేయి. కాని లోపల్లోపల ఈ'దత్తత'అన్నముక్క తూట్లాపొడిచేది. కాని దినవేళల్లో, ఆమాట్లాడుకునేటప్పుడు, రాత్రిల్లు దగ్గరగా తీసుకున్నప్పుడు, హృదయం అతన్ని దూరంచేసినట్టు, తిరగబడేది.

ఆ ఆదివారం వాళ్ళ స్కూలు వార్షికోత్సవానికి వెళ్లేం. పది, పన్నెండు వత్సరాల బాలికలు,ఒకేవిధమైన దుస్తుల్లో,ఖద్దరు స్వాతంత్ర్యాన్ని ఒలికిస్తుంటే, చలాకీగా, నవ్వుతూ, మర్యాదతో, యౌవనభారం వచ్చిన యువతుల్లా సంచరించడం, గౌరవించడం, మర్యాద చెయ్యడం, నాలోని ఆనందాన్ని విచ్చలవిడి చేస్తోంది.

అంతవరకూ నాకు రాజా, కళాజీవితంలో వయసుపిల్లలకి చెయ్యి మళిపిస్తున్నాడని తెలియనేలేదు. ఇటువంటి సంస్థలో ఉన్నాడా? భావి భారతనారీమణులని, త్యాగంచేసి,ఆంధ్రత్వం నిలబెడుతున్నాడా?

ఆ రాత్రి నృత్యంచూచేం, నేను ఏ అమర ప్రపంచపు అంచుల్లో ఉన్నానో, ఏ దేవత్వం నన్ను అలముకొందో తెలియకనే వాళ్ళతో ఆడుకున్నా, పాడే, నవ్వే...

వాళ్ళ సాగనంపేరు కృతజ్ఞత, ఆరాధన ఆయన ఎడ అంతా కనపర్చేరు. ప్రేమించేరు వాళ్ళు. నాకు సిగ్గు కల్గుతోంది. రాధా ఆదర్శం ఇదా?

ఇంతవరకూ, ఎవరిబిడ్డనో తెచ్చుకోవాలి అన్న తలంపు అర్థంకాలేదు నాకు అది హృదయాన్ని పొడిచినట్టుగానే వుంది. అందులో ఓ విధమైన జుగుప్స, కోపం, విముఖత ఆయన ఎడ కల్గేయి. ఎప్పుడూ చూడని సంకుచిత దృష్టితో పర్యవేక్షించేదాన్ని...ఆయన్ని ఆ దృష్టితోనే అర్థం చేసుకోగలిగే ననుకున్నా.

మరి ఇప్పుడో? ఆ రాత్రంతా నన్ను నేను సింహావలోకనం చేసుకున్నా, తప్పంతా నాదిలా తడుతుంది. రాధాలోని ఈ సరస్వతీ ఝరులు ఎంత గుప్తంగా వున్నాయి.నాచేష్టలు, నాద్వేషం నన్ను కుమిలించి సిగ్గుపరచాయి.

ఏదో ఆశించాలి అనిపించేయి...ఆయన కాఫీ త్రాగుతున్నప్పుడు, ఉదయకాంతుల చల్లదనంలో అన్నా. 'మనం ఓ పిల్లాణ్ణి పెంచుకుందాం.'

ఆయన ఆశ్చర్యపడ్డారు. నోటమాట రానే లేదు. 'నిజంగా' నమ్మలేనిస్థితి ఆయన్ని అల్లా అనిపించింది.

* * *

ఆ వేసవుల్లో వసంత వచ్చింది మూడున్నర వత్సరాలతో గుండ్రటి ముఖం, ఎరుపుచాయ, నల్లటిగుడ్లు, కనుమాత్రంగా ఉన్న వసంత నా పోలికేమో అనుకున్నా. మొట్టమొదట్లో అంతా క్రొత్తగా సిగ్గు గానే ఉండిపోయింది.

రోజులు గడిచిన కొద్దీ ఆ సిగ్గు, క్రొత్త నెమ్మదిగా విడిచిపోయేయి. ప్రొద్దుటే లేచి. ప్రక్కగా నా దగ్గరలో చిన్న మంచంమీద ఇంకోజీవి పడుకుంది. నిద్రలేవలేదు అనుకోవడమే విచిత్రంగా వుంది.

వసంతకి ముదురు రంగుబట్టలంటే ఇష్టం. ఆరుద్రపురంగు గౌను ఎప్పుడూ ఒదిలేదే కాదు. వచ్చీరాని మాటల్తో వెనువెనకే తిరుగుతూ, తనకి ఏంకావాలో చెప్పేది. ఏం ఇష్టమో అడిగేది.

ఒక్కొక్క సమయంలో వసంతని చూస్తుంటే ఏ పదిహేనువత్సరాలో నిండినదానిలా మాట్లాడేది. ఇంకో సమయంలో ఏమీ తెలియని ఆట బొమ్మలా ఉండేది. కాని అవన్నీ నాకు ఏదో కన్ను నూత్నలోకంలో తెరిపించేవి, ఆశ్చర్యంగా వుండేది.

ఆ సాయంత్రం తల దువ్వుతున్నపుడు అద్దంలో చూస్తూ 'నువ్వు నాపోలికే' అంది.

తలూపి నవ్వింది. 'మనం ఇద్దరం ఒకలాగే వున్నామే.' ఆ క్షణంలో హృదయానికి హత్తుకుని ముద్దాడా లనిపించింది. సంతోషించి బుగ్గ మీద చిటికె వేస్తూ నవ్వే.

ఆరోజుల్లో ఎవరిపిల్లో వచ్చి, అమ్మా అని పిలవడంతో ఒళ్లు జలదరించేది. ఆ ఆనందంలో ఒళ్లు పరవశమయ్యేది. ప్రక్క పిల్లల్ని పిలిచి నన్ను చూపిస్తూనే 'మాఅమ్మ' అనేది...ఎన్నో. ఈ క్షణంలో కూర్చుని, ప్రతీ చిన్నవిషయంలోనూ నన్ను ఎలా వసంతకి సమర్పించుకున్నానో తలచుకోవడంలో దుఃఖం పట్టపగ్గాలు లేకుండా అవుతోంది. నాఅంతట నేను మారేనా?

ఆ రోజు...ఆదివారం అనుకుంటా. వసంత ఆడుకుని దీపాలవేళకు వచ్చింది. అలసినట్టు కూర్చుంది. ఎప్పుడూ మాట్లాడకుండా ఉండని వసంత ఎందుకు అంత నిశ్శబ్దంగా వుందా అని చూచే. ఒళ్లు వేడిగా కాగుతోంది. నెమ్మదిగా మంచంమీద పడుకోబెట్టే.

'అమ్మా ! బాధగా ఉందే.'

ఏంచెయ్యనూ ? డాక్టరు వచ్చేడు, వెళ్లేడు. అది చంటిపిల్లల వాతం అని పెదిమ బిగపట్టి అన్నాడు. బాధలో మూలిగింది. కదల్లేనని ముక్కింది. ఆవేదన...ఏమవుతుంది? ఆ ఘంటల్లో ఒకళ్ల పక్కగా ఒకళ్లం కూర్చుని, దుఃఖంలో దేవుణ్ణి ప్రార్థించేం...ఏడ్చేం.

ఆ ఆఖరు ఘడియలోనే...నెమ్మదిగా కళ్లు తెరుస్తూ 'అమ్మా ! నిద్రపోతానే' అంది...అంతే !

శాశ్వత సమాధే. దీర్ఘనిద్రే పోయింది. తను వచ్చినపని, ఆ దేవతాలీలలు అయిపోయాయనే వెళ్లిపోయింది. ఎక్కడికో ... వసంతా ! ఎవర్ని పిలవనూ ? ఈ రాత్రిళ్ళలో కప్పు ఉందో లేదో అని ఏ చిన్నమంచంవైపు చూడనూ ? 'అమ్మా !'

అని నోరారగా ఎవరు పిలుస్తారు ? ఇక నాకు లోకం, ప్రపంచకం.

నిజంగా నేను నిలువుదోపిడీ అయ్యేను. వంచింపబడ్డాను కూడా. వసంతకి ప్రేమంతా ధారపోసి, అది 'నా' అని అనుకునే ఇచ్చే. లోపం చెయ్యకుండా, నా స్వర్గం ... త్యాగంచేసి. కాని నాకు నూత్న జీవితనం ప్రసాదించడం బదులుగా మృత్యువు ఇయ్యబడింది... ఎంత క్రూరంగా వుంది!...

ఆయనా బాధపడుతున్నారని తెలుసు కాని... కాలం జరుగుతున్నకొలదీ ఆయనలో మార్పు తెచ్చింది. ఆ గాయాన్ని మాన్పుతోంది. హృదయంనాకు జ్ఞప్తిలో బాధ ఇస్తోంది. అసలు జీవించడం ఓ వ్యాపారమేమో! అందులో రాజా జీవిస్తూనే భావి, వర్తమానాల్తో సరిపడేట్టు ఒంచుకున్నాడు; గతంతో నిమిత్తం లేనట్టే. ఎప్పుడూ పురుషుడు అంతే!

* * *

ఆ పండుగలకు రాజా చెల్లెలు పాప వచ్చింది. తల్లిఒళ్లో నిద్రపోతున్న పిల్లాడినిచూసి ప్రశ్నలు వేసి, ఆవిడ ఏదో చెప్పింది. ఏం చెప్పిందోకూడా నాకు శూన్యం క్రింద అర్థంకాలేదు. సంసారం గురించి ఎన్నో మాట్లాడింది. భర్త ఆదరణ, అనురాగం ఎలావుందో సిగ్గుపడుతూనే అంది.

వెళ్ళేటప్పుడు చీరా, రవికలగుడ్డా పెట్టే. చంటిపిల్లాడిని ఎత్తుకున్నా... నాలో నాకే న్యూనత కల్గుతోంది.

'నువ్వు వయస్సులో ఉన్నావే! నిరాశ ఎందుకు? నువ్వు చేసేదేమిటో ఆలోచించావా? నీ భర్త, నీ గృహం, నీ బిడ్డలు, అందర్నీ ఒక్కరాత్రి పోగొట్టుకోవచ్చు. తర్వాత అవి నీవి కావేమో! ప్రతిజీవి తనపని నిర్వర్తించి తను వెళ్ళిపోవాలి...' ఆలోచనలు వచ్చేయి. ఏదో చైతన్యం నులుముతోంది.

ఆ సాయంత్రం రాజా వచ్చాడు. ఎదురుగా వెళ్లి పుస్తకాలు అంది పుచ్చుకున్నా. ఖండువా చిలక్కొయ్యను వేసి, రాజా ఆశ్చర్యపోతున్నాడు. నవ్వే...లోపలికి వెళ్లిన నడుంమీద ఆయన అర్థం కాని దృక్కులు దాగుకొంటున్నాయి.

కాఫీ తెచ్చే ఏవో కబుర్లు చెప్పేరు. విన్నా. నవ్వే. ఆ రాత్రే...దగ్గరగా తీసుకుంటూ 'ఆ తొలిరోజులు జ్ఞాపకం తెస్తున్నావ్' ఆనందంలో అన్నారు.

హృదయం బిగుసుకున్నట్టు అయింది. ముఖం త్రిప్పుకున్నా. ఆయన రోజా నేను మారుతానని ఆశిస్తూనే గడుపుతున్నారు. ఈ నాడు అనుగుణంగా ప్రవర్తింలేక పోయినందుకు దుఃఖం వస్తోంది. హృదయం పగిలిపోయింది. చాటుగా హృదయం రోదించలేక మాభావి ఏమిటి, మా వివాహఫలితంగా ఏం నిలబడింది ఈ క్షణంలో అనిపించింది.

'రాజా! నావెర్రిరాజా'' అని ప్రతికణం ఎలుగెత్తింది.

సంవత్సరాది వచ్చింది. జరుగుతున్న రోజులు రాజా అలసట, ముడతలుచూసి ఓర్చుకోలేనంటున్నె. సహృదయం నే పోగొట్టుకున్నవి చూపిస్తూంది. అవి చూడలేకపోయే. నాలో నేను తగిలించుకున్న, ఇనపకచ్చడాలు విడిపోయి హృదయం పరవళ్ళు తొక్కింది...

ఆరోజుల్లో ఆనందంగా, బూజు పట్టిన హృదయాల్ని దులుపుకుని గతులువేసేం. పాడేం. దగ్గరగావచ్చేం. ఆ ఘడియనుండీ అమరత్వంలోనే ఉన్నాం...రోజులు గడిచేయా! నెలలు జరుగుతున్నాయా ? అనిపించింది.

ఆరోజు రాత్రి, అతని చేతుల్లోనే ఉండేదే చెప్పే. రహస్యంగా. వెయ్యివసంతాల్లో నృత్యం చేస్తూనే.. ఆనందంలో మాకు కన్నీళ్లు కారేయి.

* * *

కళ్ళుతెరిచే: అమ్మపక్కనుంచుంది. 'అమ్మా.'

'తెలివివచ్చిందా తల్లీ!' లేవబోయే. రాజా, అమ్మావాళ్ళు జ్ఞాపకం వచ్చేరు. నా నీరసం కదలనివ్వటంలేదు.

'నా పిల్లాడు' అమ్మ తెచ్చింది. 'అంతా నీ పోలికే. ఆరోగ్యంగా, అందగా ఉంటాడు.' ప్రక్కనే ఉంచుతూ 'మొదట్లో నీరసంగా ఉన్నా ఇప్పుడు కోలుకుంటున్నాడు.'

'అంటే!' నాకు అర్థం కావటంలేదు

'వారంక్రితం పుట్టేడు.అవుపాలు పోస్తున్నాం.'

హృదయం ఆగిపోయింది. వారంరోజులు, నేను ఏమయ్యేను? ఇన్ని రోజులూ, నా బిడ్డ, నా సొత్తు అమ్మచేతుల్లో, డాక్టర్ల ఆధీనంలో ఉండిపోయేడా! భరించలేకుండా ఉన్నా.

'వద్దు అమ్మా! నాదగ్గరనే ఉంచనీ...' గట్టిగా అన్నా. నేను ఉంచుకోలేనని తెలుసు. నా చేతుల్తో బాబు ముఖం తడిమే. ఆ నోరుదగ్గర నాలిక తడి చేస్తూంటే మరుపే కల్గింది. ఆ ఉంగరాలజుట్టు రాజాని జ్ఞాపకం చేస్తోంది. నల్లటి గుడ్లు... ముఖం...నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది ఆనందం.

ఆతర్వాత నేను త్వరగా కోలుకోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. నాలో ఒక్కటే కోరిక... నాబిడ్డని ఒకళ్ళచేతుల్లో ఆఖరికి అమ్మఅయినా సరే, అనాధలా పెట్టడం ఇష్టంలేదు. పరాయి వాళ్ళు...నేనే పెంచాలి... ఇదే భావన నా ఆరోగ్యం నాకు తెచ్చింది.

రోజులు నూత్న ప్రపంచంలో నిమిషాలయ్యేయి. కొత్త మగతగా ఉన్నా, కొంచెం పడిసెంపట్టినా, దగ్గినా, అజీర్తి చేసినా, కక్కినా డాక్టరుకు కబురుపంపేదాన్ని. మందువచ్చేవరకూ, నిలవనిచ్చేదాన్ని కాదు. అవసరం, అనవసరంఅన్న యోచనే పోయింది, నాకు, నాబాబుఒక్కడే...


నెలలు జరుగుతున్నై. రాజా నా విచిత్ర పంథాని గూర్చి బాధపడుతూనే ఉన్నాడు. నేను విశ్రాంతి తీసుకోవటంలేదు, చచ్చి బ్రతికినా. ఒకటి రెండుసార్లు అన్నాడు...

ఆ రోజుల్లో ఏదోవిషయంలో రాజాకి నాకు చర్చ వస్తూనేవుండేది. తను నేను పెంకితనం నేర్పుతున్నాననేవాడు. ఎత్తుకోవడం, లాలన పెంకితనం అవుతుందా?

రాజా ఆరోజుల్లో మారేడు. చిరాకు, కోపం, బహుశః బాబుతోనే నాకాలం అంతా ఆవృతమైందని ఈర్ష్య అనుకుంటా. నా బాబు, సంవత్సరం దాటింది... నుంచుంటున్నాడు. ఓ రోజు రాజా 'సుందరీ! నువ్వు వాణ్ణి చెడగొడుతున్నావ్! అప్పుడే వాడు ప్రపంచం అంటే అడిగితే, ఏడుస్తే వచ్చేస్తుంది తనకి అన్న భావంలో పడ్డాడు. ఇలావుంచుతే ఎలా తయారవుతాడో ఊహించేవా?' అని అడిగేడు.

బాబుమాట ఎత్తితేనేచాలు నాకు రవులుకునేది. 'అందరిలాగే పెద్దవాడవుతాడు ... కాని మీకు మల్లే క్రూరహృదయుడు మాత్రం కాడు...'

'క్రూరహృదయం కాదు సుందరీ! నీకు వాడెంతో నాకూ అంతే. వాణ్ణి ఇలా పెంకె ,మంకుతనాల్తో తీసుకువస్తే భావికి మంచిదనుకుంటావా?'



మీకు ప్రేమ, త్యాగం అంటే తెలుసా ?'

నవ్వేడు. 'ప్రతీ స్త్రీ ప్రేమిస్తుంది, దాన్ని సంతానపు ఉన్నతి, భావికోసం ఉపయోగపడేట్టు వినియోగిస్తుంది. నాశనంకోసం కాదు. నువ్వు కూడా ?...'

అనుకోకుండానే, బాబుకు మొదట్లో కొంచెం జలుబు తర్వాత జ్వరం, ఒళ్లు తెలియని మగత... డాక్టర్ని పిలిచేం. పరీక్షచేసి రక్తం తీసుకు వెళ్ళుతూ రేపు అన్నాడు. రేపు! ఆత్రుత...మాలోవుండే పట్టుదలలు, కోపాలు, విముఖతలు, అన్నీ గాలిలో ఇంకిపోయాయి.

* * *

ఇద్దరం వంతులువారీగా రాత్రి, ఆ వుయ్యాల పక్కగా కూర్చుందామని నిర్ణయించుకున్నాం. అర్ధరాత్రి లేప మన్నాడు. కాని లేపలేదు. లేపక పోవడమే మంచిదనిపిస్తోంది. నా బాబు ఉయ్యాల్లో, కళ్లెదురుగానే బాధపడుతున్నాడు. ఏమవుతుంది?

ఒకటిన్నర వత్సరం, నేకల్పించుకున్న, ఊహించుకున్న భయం, నిజమైనా అబద్ధమైనా- దాన్ని జయించాలని సర్వస్వం ఒడ్డే. నా సుఖం పాడు చేస్తూన్నదల్లా ఎదురుకున్నా. 'బాబు నావాడు. వాణ్ణి ముట్టుకోడానికి ఎవరికీ హక్కులే'దని చాటే.

మృత్యుదేవత క్రూరదంష్ట్రలను తెరచుకొని బాబును కబళించివెయ్యొచ్చు. నిజమే అయితే నాకు జీవించడానికి స్థానమేలేదు. నిరాశ! ఎంత హృదయపూర్వకంగా ప్రేమను బలిపెడుతున్నా, అది కూడ బాబును రక్షించ లేదు. నిజంగా ప్రేమించడం మూర్ఖత్వమేమో అనిపిస్తోంది. ప్రతీ తల్లీ, ప్రతీమాతృహృదయం, తన బిడ్డణ్ణి అద్దాలలో పెట్టుకుని, హృదయానికి హత్తుకుని ప్రేమించడంలో మూర్ఖురాలు అయి నట్టే తడుతోంది.

ఈ క్షణంలో ఊరార్పు నాకు లేదు, దేవుణ్ణి ప్రార్థించడంకంటే. ఈ సమీకరణ నాజీవితాన్ని కొత్త అద్దాలతో చూడడం నేర్పుతోంది. ఈనాడు త్యాగం, ప్రేమ, సుఖం తాత్కాలికంగా వుంటాయి. అవి ఎప్పుడూ దుఃఖాంతాలే! వీటిని విశాలహృదయంతో ఇచ్చేట్టు, ప్రతిఫలం కాంక్షించకుండా సంసారానికి త్యాగంచెయ్యమని చెపుతున్నాయి. అప్పుడు శాంతి ఉంటుందేమో!

ఇంతకాలం, నాసైతికపతనం నాకు అధైర్యం నూరి పోసిందా!

ఇదా సత్యం! దాన్ని తెలుసుకోడానికి ఇన్ని ముళ్ళకంచెలు దాటాలా? ... ఉయ్యాలమంచం కోడుకు అనుకున్నా. బాబు! కళ్ళమ్మట నీళ్ళు నెమ్మదిగా, ఒస్తున్నాయి. నెమ్మదిగా ఉయ్యాల్లోంచి చేతుల్లోకి తీసుకున్నా. నాహృదయానికి హత్తుకున్నా. అంతకంటె ఎక్కువశాంతి లేదేమో! నేను నిజంగా- అన్నం రొట్టె ఇస్తే ఆత్రుతతో తీసుకొని, దూరంగా తీసుకువెళ్ళి తింటున్న కాదిశీకి నేమో! దాన్ని ఎవరైనా దొంగిలిస్తారేమో అన్న భయమే! ఆ పతనస్థితికి ఒచ్చేనా!

వేడి శ్వాసలు బుగ్గలమీద పడుతున్నై. ఇక నుంచైనా నిజమైన స్థానంలో వాడికి తల్లినవుతా. నా స్వార్థంతో పెంచను. వాణ్ణి వీరుడిగా పెంచుతా. దానికి వాని భావి, నాప్రేమమీద ఆధారపడివుంది. నాభయానికి, పిరికితనానికి వడ్డీగా వాడిని బలిపెట్టను...అని ఆలోచించగా హృదయం గోడెత్తింది. ఆవేదన...ఇంకో తలంపే అవుతే! ఈ మాతృప్రేమ, మాతృత్వపు అమరత్వం పొంగి పోవలసిందేనా...నిర్జనంగా, నిర్దయగా...జవాబు?

తెల్లవారింది. ఉలిక్కిపడిలేచి రాజా 'సుందరీ! నన్ను లేపేవుకాదేం...ఎల్లావున్నాడు?' ఉద్వేగంగా అన్నాడు.

డాక్టరు వచ్చేడు... చూచేడు. 'రాత్రి భయపడ్డాను కాని...గండం దాటింది. రెండు మూడు రోజుల్లో తిరుగుతాడు' అని వెళ్ళాడు.

రాజా నావైపుచూచేడు. ఇద్దరం బాబు వైపు చూచేం. చూపులు కలుస్తున్నాయ్. చిరునవ్వు ఆక్రమిస్తోంది. రాజా కళ్ళలో కన్నీళ్ళు తిరుగుతున్నై. వెర్రిదుఃఖం, ఆనందముత్యాలు రాలుస్తోంది. పూర్ణశాంతి, అమరత్వం కల్పిస్తోంది.

'సుందరీ!' అయనవైపు చూచే! అమరత్వపు అంచులా.

'వాళ్ళమీదే భావి, దేశం, ప్రజ ఆధారపడి వుంది. చరిత్రల్ని మన తర్వాత వ్రాసేవాళ్లు వాళ్లు...మనంకాదు...'అన్నాడు.

నిజమే! హృదయం హిందోళం పాడుతోంది. వెల్తురు ఉయ్యాల చువ్వల్లోంచి బాబుకు క్రొత్త వెలుగు నిస్తోంది.